ఆకాశవాణి హైదరాబాద్ కేంద్రం

ప్రాంతీయ వార్తా విభాగం

ప్రాంతీయ వార్తలు

తేదీ. 08.11.2025 సమయం. 13.10 గంటలు

ముఖ్యాంశాలు

1. ప్రజల దృష్టి మళ్లించేందుకు బీజేపీపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తప్పుడు ప్రచారం చేస్తున్నారని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి ఆరోపించారు.

2. ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలపై ప్రైవేటు కళాశాలల యాజమాన్యాలతో రాష్ట్ర ప్రభుత్వం జరిపిన చర్చలు సఫలమయ్యాయి. రాష్ట్ర ప్రభుత్వం ఈ మేరకు 600 కోట్ల రూపాయలు మంజూరు చేసింది.

3. ఢిల్లీ విమానాశ్రయంలో సాంకేతిక సమస్య కారణంగా హైదరాబాద్ రాజీవ్ గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయంలో పలు విమానాల రాకపోకలకు అంతరాయం కలిగింది.

4. రాష్ట్రంలో రేపటి నుంచి రాత్రిపూ ట ఉష్ణోగ్రతలు గణనీయంగా తగ్గనున్నాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం వెల్లడించింది.

కిషన్ రెడ్డి:

ప్రజల దృష్టి మళ్లించేందుకు బీజేపీపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తప్పుడు ప్రచారం చేస్తున్నారని కేంద్ర బొగ్గు , గనుల శాఖ మంత్రి కిషన్ రెడ్డి ఆరోపించారు. హైదరాబాద్‌లోని పార్టీ కార్యాలయంలో కిషన్‌రెడ్డి మీడియాతో మాట్లాడుతూ.. ఎన్నికల్లో ఇచ్చిన హామీల గురించి రేవంత్ రెడ్డి ఎందుకు మాట్లాడటం లేదని ప్రశ్నించారు. హామీల అమలులో రేవంత్ విఫలమయ్యారని అన్నారు. తెలంగాణ రాష్ట్ర అభివృద్ధికి బీజీపీ ఏం చేసిందో ప్రజలకు తెలుసని అన్నారు. కాంగ్రెస్ , బీఆరెస్ ల మాదిరి బీజేపీ అవినీతి, కుటుంబ పార్టీ కాదని అన్నారు. బీజేపీ పాలనపై చిన్న అవినీతి ఆరోపణ కూడా రాలేదని గుర్తు చేశారు. కాంగ్రెస్ హైకమాండ్‌కు భయపడి రేవంత్‌రెడ్డి.. కె చంద్రశేఖర రావుపై చర్యలు తీసుకోవడం లేదని ఆరోపించారు.

DESK

కాలేజీల బంద్-విరమణ:

ఫీజు రీయింబర్‌స్మెంట్ బకాయిలపై ప్రైవేటు కళాశాలల యాజమాన్యాలతో రాష్ట్ర ప్రభుత్వం జరిపిన చర్చలు సఫలమయ్యాయి. దీంతో బంద్ విరమిస్తున్నట్లు ఉన్నత విద్యా సంస్థల సమాఖ్య ప్రకటించింది. 600 కోట్ల రూపాయలు తక్షణమే విడుదల చేస్తామని , మరో 300 కోట్ల రూపాయలు త్వరలో చెల్లిస్తామని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క హామీ ఇచ్చారు. కాగా , రాష్ట్రవ్యాప్తంగా ఇంజినీరింగ్, ఫార్మసీ తదితర వృత్తి విద్యా కళాశాలలతో పాటు డిగ్రీ , పీజీ

కళాశాలలు ఈ నెల 3వ తేదీ నుంచి బంద్ కారణంగా మూతబడ్డ విషయం తెలిసిందే.

-డెస్క్

విమాన ఆలస్యం:

ఢిల్లీ విమానాశ్రయంలో సాంకేతిక సమస్య కారణంగా విమానాల రాకపోకలకు అంతరాయం కలిగిందని , దాని ప్రభావం దేశ వ్యాప్తంగా పలు విమానాశ్రయాలతో పాటు హైదరాబాద్ లోని రాజీవ్ గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయంపై కూడా పడిందని అధికారులు వెల్లడించారు. వియత్నాంతో పాటు ఢిల్లీ , ముంబై, శివమొగ్గ వెళ్లాల్సిన పలు విమానాలను రద్దు చేసినట్లు ప్రకటించారు. విమానాల రాకపోకల్లో తీవ్ర ఆలస్యం కావడంతో శంషాబాద్ విమానాశ్రయంలో దాదాపు 200 ప్రయాణికులు ఆందోళనకు దిగారు.

-డెస్క్

రేవంత్-జన్మదినం:

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి జన్మదినం సందర్భంగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఆయనకు సోషల్ మీడియా వేదికగా శుభాకాంక్షలు తెలిపారు. రేవంత్ రెడ్డికి భగవంతుడు సంపూర్ణ ఆరోగ్యం , దీర్ఘాయుష్షును ప్రసాదించాలని ప్రధానమంత్రి

ఆకాంక్షించారు. పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ , లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా , పంజాబ్ గవర్నర్ గులాబ్ చంద్ కటారియా , తెలంగాణ గవర్నర్ జిష్ణుదేవ్, కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ తదితరులు రేవంత్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు.-డెస్క్

ఉపఎన్నిక-సెలవు:

జూబ్లీహిల్స్ అసెంబ్లీ నియోజకవర్గ ఉప ఎన్నిక పోలింగ్ రోజు నవంబర్ 11న నియోజకవర్గ పరిధిలోని అన్ని ప్రభుత్వ , ప్రైవేటు కార్యాలయాలు , సంస్థలు, పాఠశాలలకు సెలవు మంజూరు చేస్తున్నట్లు హైదరాబాద్ జిల్లా కలెక్టర్ హరిచందన ఒక ప్రకటనలో తెలిపారు. కాగా , పోలింగ్‌కు ఒక రోజు ముందు , అంటే నవంబర్ 10వ తేదీన , కేవలం పోలింగ్ కేంద్రాలుగా ఏర్పాటు చేసిన పాఠశాలలు , కార్యాలయాలకు మాత్రమే సెలవు వర్తిస్తుందని స్పష్టం చేశారు. ఈ మేరకు ఆమె ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సెలవు దినాల్లో పనిచేసే అర్హులైన ఉద్యోగులకు జీతంతో కూడిన సెలవు మంజూరు చేయాలని ఆయా ప్రభుత్వ , ప్రైవేటు యాజమాన్యాలను కలెక్టర్ ఆదేశించారు.-డెస్క్

కవిత-జనం బాట:

జనం బాట పేరుతో ఎమ్మెల్సీ , తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత చేపట్టిన పాదయాత్ర ఈ రోజు, రేపు వరంగల్ హన్మకొండ జిల్లాలలో జరగుగుతోంది. హన్మకొండలో కవిత మీడియాతో మాట్లాడుతూ.... ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా ఉన్న సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి, సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తామన్నారు.

- వరంగల్, పి టి సి

చిట్యాల-ప్రమాదం:

నల్గొండ జిల్లా చిట్యాల మండలం గుండ్రాంపల్లి వద్ద హైదరాబాద్-విజయవాడ 65వ జాతీయ రహదారిపై ఈ ఉదయం జరిగిన ప్రమాదంలో ఓ కారు పూర్తిగా దగ్ధమైంది. అయితే, కారులో ప్రయాణిస్తున్న ఎనిమిది మంది సురక్షితంగా బయటపడ్డారు. సమాచారం అందిన వెంటనే అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకునే మంటలను ఆర్పివేశారు. ప్రమాదంతో జాతీయ రహదారిపై వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం కలిగింది. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

-డెస్క్

బాల్య వివాహాలు:

ఆసిఫాబాద్ జిల్లాలో బాల్య వివాహాల నిర్మూలనకు పటిష్ట చర్యలు తీసుకుంటున్నట్లు జిల్లా బాలల సంరక్షణ అధికారి బూర్ల మహేష్ అన్నారు. "ప్రత్యేక బాల్య వివాహాల నిర్మూలన" కార్యక్రమంలో భాగంగా పర్సునంబాల గ్రామంలో గ్రామస్థాయి బాలల సంరక్షణ కమిటీని ఏర్పాటు చేసి , పోస్టర్ ఆవిష్కరించారు. చైల్డ్ మ్యారేజ్ ప్రొహిబిషన్ యాక్ట్ 2006 ప్రకారం బాల్య వివాహం చేస్తే రెండు సంవత్సరాల జైలు శిక్ష లేదా లక్ష రూపాయల జరిమానా విధించబడుతుందని వివరించారు. ఎక్కడైనా బాల్య వివాహం జరిగితే వెంటనే 112 లేదా 1098 టోల్‌ఫ్రీ నంబర్లకు కాల్ చేయాలని సూచించారు.

- ఆసిఫాబాద్, పిటిసి

కళోత్సవ్:

విద్యాశాఖ ఆధ్వర్యంలో హైదరాబాదులో నిర్వహించిన రాష్ట్రస్థాయి కళోత్సవ్ పోటీల్లో కరీంనగర్ జిల్లాకు చెందిన విద్యార్థులు నాలుగు ప్రథమ బహుమతులు సాధించారు. మొత్తం 12 అంశాల్లో పోటీలు నిర్వహించగా... థియేటర్ ఆర్ట్స్ గ్రూపులో తిమ్మాపూర్ కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయం విద్యార్థులు , ఇన్స్ట్రుమెంటల్ మ్యూజిక్ గ్రూప్ లో వెన్నంపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు మొదటి స్థానం సాధించారు. వీరంతా త్వరలో ఢిల్లీలో జరగబోయే జాతీయస్థాయి కళోత్సవ్ పోటీల్లో పాల్గొంటారు.

-పిటిసి, కరీంనగర్

స్పీడప్:

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం పనులను వేగవంతం చేయాలని హన్మకొండ జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ అధికారులను ఆదేశించారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలపై వివిధ శాఖల అధికారులతో సమీక్షించిన అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ... లబ్ధిదారులు వారంలోగా నిర్మాణ పనులు ప్రారంభించేలా చూడాలన్నారు. రెండు పడక గదుల ఇళ్ల లబ్ధిదారుల ఎంపిక వారంలోగా పూర్తి చేయాలని.... జాతీయ ఉపాధి హామీ పథకం కింద ఇందిరమ్మ లబ్ధిదారులను అనుసంధానం చేయాలని సూచించారు.

-పీటీసీ, వరంగల్

జాతర:

మంచిర్యాల జిల్లా కోటపల్లి జనగామ గ్రామదేవత మదన పోచమ్మ జాతర ఈ రోజు ఘనంగా ప్రారంభమైంది. మూడు రోజుల పాటు జరిగే ఈ జాతరకు పరిసర ప్రాంతాల నుండి ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరై మొక్కులు చెల్లించుకుంటున్నారు. ఉదయం అమ్మవారిని గోదావరి నది జలాలతో అభిషేకించి , అనంతరం రథంలో

ఊరేగించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కాకుండా అన్ని ఏర్పాట్లు చేసినట్లు నిర్వాహకులు తెలిపారు.

- పీటీసీ మంచిర్యాల

గౌన్-గిఫ్ట్:

రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ ఏఎస్పీ శేషాద్రిని రెడ్డి నిన్న సాయంత్రం పట్టణ శివారులోని బేడబుడగ జంగాల కాలనీకి చెందిన పిల్లలకు గౌన్లు కుట్టించి అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... సన్మానాల సందర్భంగా ఇచ్చే శాలువాలు, కండువాలు వృథా కాకుండా గౌన్లు కుట్టించి చిన్నారులకు అందజేసినట్లు తెలిపారు. నిరుపేద కుటుంబాలకు ఇలాంటి చిన్న చిన్న సహాయాలు ఆత్మస్థైర్యం ఇస్తాయని అన్నారు. తమ పిల్లలకు గౌన్లు అందజేసిన ఏఎస్పీకి చిన్నారుల తల్లిదండ్రులు కృత జ్ఞతలు తెలిపారు.

-పిటిసి, సిరిసిల్ల

పవర్ లూమ్-పోస్టర్

పవర్ లూమ్ , అనుబంధ రంగాల కార్మికుల హక్కుల సాధన కోసం సంఘం అనేక పోరాటాలు చేస్తోందని ఏఐటీయూసీ రాజన్న సిరిసిల్ల జిల్లా ప్రధాన కార్యదర్శి పంతం రవి అన్నారు. జిల్లా కేంద్రంలోని కార్మిక భవనంలో చేనేత పవర్ లూమ్

కార్మిక సంఘం నాల్గవ మహాసభ పోస్టర్ ను ఆవిష్కరించారు. ఈ సభలకు ముఖ్య అతిథితులుగా సీపీఐ రాష్ట్ర కార్యదర్శి , కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు, సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకటరెడ్డి , ఏఐటీయూసీ రాష్ట్ర నాయకులు హజరవుతారని చెప్పారు.

-సిరిసిల్ల, పీటీసీ

వాతావరణం:

రాష్ట్రంలో రేపటి నుంచి రాత్రిపూట ఉష్ణోగ్రతలు గణనీయంగా తగ్గనున్నదని హైదరాబాద్ వాతావరణ కేంద్రం వెల్లడించింది. రాబోయే రోజుల్లో కనిష్ఠ ఉష్ణోగ్రతలు 9 నుంచి 14 డిగ్రీల మధ్య నమోదయ్యే అవకాశం ఉందని పేర్కొంది. ఈ నేపథ్యంలో రాష్ట్రంలోని 23 జిల్లాలకు ఎల్లో అలర్ట్ జారీ చేశారు. ముఖ్యంగా ఆసిఫాబాద్ , మంచిర్యాల, నిర్మల్ జిల్లాల్లో కనిష్ఠ ఉష్ణోగ్రతలు 10 డిగ్రీల సెల్సియస్ కంటే తక్కువకు పడిపోయే అవకాశముంది. ఆదిలాబాద్ జిల్లా బేలలో ఈ రోజు అత్యల్పంగా 14.8 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రత నమోదైనట్లు అధికారులు తెలిపారు.

-డెస్క్

దీపోత్సవం:

కార్తీక మాసోత్సవాలలో భాగంగా నిన్న రాత్రి హన్మకొండ జిల్లాలోని భద్రకాళి ఆలయంలో దీపోత్సవం ఘనంగా నిర్వహించారు. మహా మండపంలోని భద్రకాళి అమ్మవారి ముందు భక్తులు దీపాలు వెలిగించారు. అంతకుముందు అమ్మవారి ఉత్సవ మూర్తికి పల్లకి సేవ  , విశేష అభిషేకాలను నిర్వహించారు. ఉత్సవాలలో భాగంగా సాంస్కృతిక ప్రదర్శనలు, కర్ణాటక గాత్ర కచేరి భక్తులను అలరించాయి.

- వరంగల్, పి టి సి

వంద రోజుల ప్రణాళిక:

మున్సిపాలిటీలలో పారిశుధ్యం ,  పరిశుభ్రతకు సంబంధించి ఆసిఫాబాద్  ,  కాగజ్ నగర్ మున్సిపాలిటీలలో వంద రోజుల ప్రణాళిక కొనసాగుతోంది. ఆసిఫాబాద్ మున్సిపాలిటీలో పనులను కమిషనర్ గజానంద్ పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు,  సలహాలు అందచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... పారిశుద్ధ్యమనేది నిరంతరం ప్రక్రియ అని... దీనికి ప్రజల సహాయ సహకారాలు ఎంతో అవసరం అన్నారు. ఎక్కడైనా అపరిశుభ్రత ఉన్నట్లయితే వెంటనే అధికారుల దృష్టికి తీసుకురావాలని సూచించారు.

-పీటీసీ, ఆసిఫాబాద్

నూతన జడ్జి:

రాజన్న సిరిసిల్ల జిల్లా పోక్సో కోర్టు జడ్జిగా న్యాయ సేవాధికార సంస్థ జిల్లా కార్యదర్శి రాధికా జైశ్వాల్ నియమితులయ్యారు. ఈ మేరకు తెలంగాణ హైకోర్టు రిజిస్ట్రార్  ఉత్తర్వులను జారీ చేశారు. నూతనంగా బాధ్యతలు స్వీకరించిన రాధికా జైశ్వాల్ కు అధికారులు శుభాకాంక్షలు తెలిపారు.

-పిటిసి, సిరిసిల్ల

పెండింగ్ బిల్స్ – వినతి:

పూర్తయిన అభివృద్ధి పనుల పెండింగ్ బిల్లులు చెల్లించాలని గ్రేటర్ వరంగల్ కాంట్రాక్టర్స్ అసోసియేషన్ సభ్యులు... హన్మకొండలోని కూడా కార్యాలయంలో కమిషనర్ చాహత్ బాజ్ పాయ్ ను కలిసి వినతిపత్రం ఇచ్చారు. ఎనిమిది నెలలుగా సుమారు 90 కోట్ల చెల్లింపులు నిలిచిపోయాయనీ...        ,  బకాయిలు చెల్లించని పక్షంలో... ఈనెల 15వ తేదీ నుంచి అభివృద్ధి పనులు ఆపేయాల్సి వస్తుందని తెలిపారు. ప్రస్తుతం 66 డివిజన్లలో   అభివృద్ధి పనులు చేస్తున్నామని, తమ సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని వారు కోరారు.

-వరంగల్, పి టి సి

రైతు-మృతి:

ఇటీవల కురిసిన అకాల వర్షాలతో వరి పైరు నేల వాలడంతో... రాజన్న సిరిసిల్ల గంభీరావుపేట మండల గజసింగవరంలో ఇజ్జయ్య అనే రైతు తీవ్ర ఆందోళనతో పొలంలోనే కుప్పకూలి ప్రాణాలు వదిలారు. కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని గ్రామస్తులు కోరారు. గంభీరావుపేట తాహాసిల్దార్ మారుతి రెడ్డి సంఘటన స్థలానికి చేరుకొని కుటుంబ సభ్యుల నుండి వివరాలు తీసుకున్నారు.

-సిరిసిల్ల, పీటీసీ